నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దామెర, మే 9 : మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నెలవారీ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం తెలిపారు. దామెర, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల, తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి గ్రామాల్లోని గృహ, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఐనవోలు : మండలంలోని ఐనవోలు సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా సబ్ స్టేషన్ పరిధిలోని ఐనవోలు, లక్ష్మీపురం, ఒంటిమామిడిపల్లి, నాగపురం, పున్నేల్, కొండపర్తి సబ్ స్టేషన్ పరిధిలోని కొండపర్తి, ముల్కలగూడెం, నర్సింహులగూడెం గ్రామాల్లో బావులు, ఇండ్లలకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయన్నట్లు ఏఈ సురేశ్‌కుమార్ తెలిపారు.

హనుమకొండ : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు భద్రకాళీ టెంపుల్, జీడబ్ల్యూఎంసీ ఆఫీసు, రంగంపేట్, ఎంజీఎం క్రాస్‌రోడ్డు, వడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 9.30 వరకు శ్రీనగర్ కాలనీ, ఎన్ఐటీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు నిట్ సెక్షన్‌లోని అన్ని ఏరియాల్లో, నక్కలగుట్ట సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 9గంటల వరకు, యాదవనగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, గోపాల్‌పుర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, మడికొండ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, కడిపికొండ సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు

హనుమకొండ, మే 9 : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో యాసంగి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వైవీ గణేశ్ తెలిపారు. జిల్లాలో 1,57,200 టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం లక్ష్యమన్నారు. ఇందుకు 157 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 22లక్షల గన్నీ సంచులు సరఫరా చేశామన్నారు. ఇప్పటి వరకు 66,236.280 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 43 రైస్ మిల్లులకు పంపించామమన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డాటా ఎంట్రీ చేస్తున్నామని తెలిపారు. 8 926 మంది రైతుల బ్యాంకు అకౌంట్లలో రూ. 98.67 కోట్లు జమ చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన

హనుమకొండ, మే 9 : హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల మీదుగా వెళ్తున్న 163జీ గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్‌బీ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి పనుల పురోగతిపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, సీజీఎం ఆర్వో శివశంకర్, వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సంబంధిత అధికారులతో హరిచందన సమావేశం నిర్వహించారు. మంచిర్యాల నుంచి భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల మీదుగా ఖమ్మం నుంచి విజయవాడ వరకూ (నాగపూర్ –విజయవాడ) నిర్మించే 163జీ గ్రీన్ ఫీల్డ్ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఇప్పటి వరకు చేపట్టిన భూ సేకరణ, రైతులకు పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రెండో దశ ప్రాజెక్టులో భాగంగా ఈ మూడు జిల్లాల పరిధిలో భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. భూ సేకరణ పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల రైతులతో ఆర్బిట్రేషన్ నిర్వహించి పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. మామూనూరు ఎయిర్ పోర్ట్ కనెక్టివిటీ రోడ్లకు సంబంధించిన భూ సేకరణపై ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించారు. సమావేశంలో జాతీయ రహదారుల శాఖ వరంగల్, ఖమ్మం ప్రాజెక్టు డైరెక్టర్లు దుర్గాప్రసాద్, దివ్య, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగేంద్రరావు, ఈఈ సురేశ్ బాబు, ఆర్డీవోలు రవి, ఉమారాణి, సత్యపాల్‌రెడ్డి, రాథోడ్ రమేశ్, నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పక్కన కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

సెర్ప్ విభాగాన్ని అభినందించిన మంత్రి, కలెక్టర్..

హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ విభాగం 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలో అగ్రగామికి నిలిచినందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అభినందనలు తెలుపుతూ హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో డీఆర్‌డీవో, డీపీఎంలకు సర్టిఫికెట్స్ అందజేశారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్యను క్యాంపు కార్యాలయంలో డీఆర్‌డీవో, డీపీఎం కలువగా అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

- **196 స్కూళ్లలో 20లోపు విద్యార్థులే ఉన్నారు**
- **జిల్లా విద్యా శాఖ అధికారి వాసంతి**

హనుమకొండ చౌరస్తా, మే 9 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు పెంచాలని జిల్లా విద్యా శాఖ అధికారి వాసంతి ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిగింది. 20లోపు విద్యార్థులు నమోదు ఉన్న పాఠశాలలు జిల్లాలో 196 ఉన్నాయని, రాబోయే విద్యా సంవత్సరంలో వీటిలో విద్యార్థుల నమోదు పెంచడానికి కృషి చేయాలని ఆదేశించారు. గుణాత్మక విద్య అమలు కోసం నిర్వహించాల్సిన కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా గుణాత్మక విద్య సమన్వయకులు శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సుదర్శన్ రెడ్డి, జెండర్ ఈక్విటీ కో ఆర్డినేటర్ సునీత, ప్లానింగ్ కో ఆర్డినేటర్ మహేశ్, రఘు చందర్రావు, డీఎల్ ఎంటీ రఘు, రాజు పాల్గొన్నారు.

పరకాలలో ఎంపీడీవో సమావేశం..

పరకాల : గ్రామాల్లో ఉన్న ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాల్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల సెకండరీ పాఠశాలలో ఎంఈవో రమాదేవి అధ్యక్షతన సెర్ప్ మహిళా సంఘాల అధ్యక్షులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. సీఎంవో సుదర్శన్‌రెడ్డి, ఏపీఎం క్రాంతి, మండల నోడల్ అధికారి నామాని సాంబయ్య, జడ్పీఎస్ఎస్ బాలుర ప్రధానోపాధ్యాయుడు సురేందర్, సక్సెస్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మధు పాల్గొన్నారు.

సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సిటిజన్లు

సైనికులకు మద్దతుగా సీనియర్ సిటిజన్ల ర్యాలీ

పరకాల, మే 9 : భారత సైనికులు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పరకాల సీనియర్ సిటిజన్లు ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం పరకాల అమరధామం నుంచి బస్టాండ్ కూడలి మీదుగా నిర్వహించిన ఈ ర్యాలీలో సుమారు 50 మంది పాల్గొన్నారు. భారత సైనికులారా.. మీ వెంటే మేముంటాం.. అమర జవాన్లకు జోహార్లు.. జై భారత్.. జై జై భారత్.. హిందుస్థాన్ జిందాబాద్ నినాదాలు చేస్తూ బస్టాండు కూడలి వద్ద మానవహారం చేపట్టారు. దాడుల్లో మృతి చెందిన భారత సైనికులకు వయోవృద్ధుల సంక్షేమ సంస్థ ఘనంగా నివాళులర్పించింది. సంక్షేమ సంస్థ పరకాల అధ్యక్షుడు రేపాల నరసింహ రాములు, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, ప్రచార కార్యదర్శి రామన్న, కోశాధికారి కైలాసం, సహాయ కార్యదర్శి ముదురుకోళ్ల సంపత్, ఉపాధ్యక్షుడు గుర్రం సదానందం, సభ్యులు రాఘవరెడ్డి చిన్న జంగారెడ్డి, డాక్టర్ శ్రీనివాసాచారి, రామారావు, సమ్మయ్య, నందయ్య, కిషన్, సంపత్ రావు, జనార్దన్‌రావు, పిట్ట వీరస్వామి, నరసింహారావు పాల్గొన్నారు.

15.50 కిలోల గంజాయి పట్టివేత

న్యూశాయంపేట, మే 9 : కాజీపేట రైల్వే పరిసరాల్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి 15.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొన్నారు. శుక్రవారం ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే పరిసరాల్లో బ్యాగు కనిపించగా తనిఖీ చేశామన్నారు. ఆ బ్యాగులో ప్లాస్టిక్ బండిళ్లలో 15.50 కిలోలకు పైగా గంజాయి లభించిందని తెలిపారు. ఎవరూ కనిపించకపోవడంతో బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగా వైజాగ్, భువనేశ్వర్ ప్రాంతాల నుంచి ముంబైకి ఎండు గంజాయి రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఈస్ట్ కోస్ట్, గాంధీధామ్, ఎల్టీటీ తదితర రైళ్లలో తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, లాలయ్య, కోటిలింగం, రషీద్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఆత్మకూరు, మే 9 : గూడెప్పాడ్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం డీఆర్‌డీవో మేక శ్రీను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉన్న జాబ్ కార్డుల ఆధారంగా ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రతిరోజూ రూ.300 నుంచి రూ.307 కూలీ వచ్చేలా కొలతలు ప్రకారం పనులు చేయించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా కాకముందే పనులు ముగించుకొని వెళ్లాలన్నారు. ఏమైనా కొలతల ప్రకారం తక్కువ పని జరిగితే సాయంత్రం వేళల్లో వచ్చి మిగతా పని పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రాజిరెడ్డి, ఈసీ రాము, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, టీఏ సురేశ్, రాజు ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి క్రీడల్లో పాల్గొనాలి

హనుమకొండ చౌరస్తా, మే 9 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెల రోజుల పాటు జరిగే ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి ప్రారంభించారు. 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్న ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే ఏదో ఒక క్రీడను ఎంచుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. దశాబ్ద కాలం నుంచి కేఎంసీ క్రీడా మైదానం ఎంతోమంది జాతీయస్థాయి క్రీడాకారులను వెలుగులోకి తెస్తున్నదని, ఇందుకుగాను సహకరిస్తున్న మెడికల్ కాలేజీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షులు సదాశివ, రాము, కార్యవర్గ సభ్యులు అభినవ వినయ్, కోచ్ గోవిందసింగ్ పాల్గొన్నారు.

ముగిసిన రిసోర్స్‌పర్సన్ల రాష్ట్ర స్థాయి శిక్షణ

హనుమకొండ చౌరస్తా, మే 9 : బాలవికాస శిక్షణా కేంద్రంలో జరుగుతున్న 33 జిల్లాలకు చెందిన రిసోర్స్ పర్సన్ల రాష్ట్ర స్థాయి ఐదు రోజుల శిక్షణ ముగిసింది. వరంగల్ పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. త్వరలో జిల్లా స్థాయిలో జరగనున్న ఉపాధ్యాయ శిక్షణకు డీఆర్పీలు సిద్ధంగా ఉండాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపేలా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్టీ కోర్సు కో ఆర్డినేటర్లు ఎల్లయ్య, గణపతి పాల్గొన్నారు.

బరిస్టా జ్యూస్ హౌస్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

కుళ్లిన పండ్లు, కాలం చెల్లిన ఆహార పదార్థాలు స్వాధీనం

సుబేదారి, మే 9 : కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బాలసముద్రంలోని బరిస్టా జ్యూస్ హౌస్‌పై శుక్రవారం దాడులు నిర్వహించారు. కుళ్లిన పండ్లు, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, రూ.21వేల విలువైన ఫ్రూట్ జ్యూస్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ మాట్లాడుతూ.. బరిస్టా జ్యూస్ హౌస్ యజమాని కిష్టావు రాజేందర్ కుళ్లిపోయిన పండ్లు, కాలం చెల్లిన ఆహార పదార్థాలతో జ్యూస్ ఉత్పత్తి చేస్తున్నట్లు తమ దాడుల్లో తేలిందన్నారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వేణు పాల్గొన్నారు.

కీర్తి ఆస్పత్రి ప్రారంభం

నయీంనగర్, మార్చి 9 : హనుమకొండలోని నయీంనగర్‌లో కీర్తి ఉమెన్స్ చిల్డ్రన్స్ ఆస్పత్రిని శుక్రవారం మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. 50 పడకల ఆస్పత్రి, నవజాతి శిశు పిల్లల అత్యవసర చికిత్స, మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం అత్యుత్తమ 24/7 వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆస్పత్రి నిర్వాహకుడు ముక్కా దిలీప్‌కుమార్, కార్పొరేటర్ చాడా స్వాతి పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..

హనుమకొండ, మే 9 : కలెక్టరేట్‌లోని రోడ్డువైపు ఉన్న షెట్టర్లలోని టీ క్యాంటీన్లను ఖాళీ చేయించి ప్రభుత్వ రంగ సంస్థలైన విజయ డెయిరీ, చేనేత జౌళి శాఖలకు అప్పగించాలని కలెక్టర్ ప్రావీణ్య నిర్ణయం తీసుకున్నారు. రెండు టీ క్యాంటీన్ల నిర్వహకులకు మే ఒకటో తేదీలోగా షెట్టర్లు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక క్యాంటిన్ నిర్వాహకుడు ఖాళీ చేయగా, మరో టీ క్యాంటీన్ నిర్వాహకుడు ఖాళీ చేయలేదు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో కలెక్టరేట్‌లోని ఆ విభాగం అధికారి శ్యాంను వివరణ కోరగా నెల రోజుల క్రితమే ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశామని, ఒకరు ఖాళీ చేయగా విజయ డెయిరీ తీసుకొన్నారని, రెండో షెట్టర్‌ను కూడా త్వరలోనే ఖాళీ చేయించి చేనేత జౌళి శాఖకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కమలాపూర్‌లో మండలంలో నిలిచిన కొనుగోళ్లు

కమలాపూర్, మే 9 : మండలంలోని గూడూరు, వంగపల్లి, గోపాల్‌పూర్, శనిగరం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు లేక నాలుగు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఓ వైపు అకాల వర్షాలు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లయ్ అధికారులు వెంటనే గన్నీ సంచులు పంపించాలని కోరుతున్నారు.

సంచులు లేక గూడూరు కొనుగోలు కేంద్రంలో కాంటా వేయకుండా ఉన్న ధాన్యం

అనర్హులకు ఇండ్లు కేటాయించడమే ఇందిరమ్మ రాజ్యమా?

అఖిలపక్ష నాయకులు



ఐనవోలు కారోబార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

ఐనవోలు, మే 9 : అనర్హులకు ఇళ్లు కేటాయించడమే ఇందిరమ్మ రాజ్యమా? అని ఐనవోలు అఖిలపక్ష నాయకులు ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ లిస్ట్‌లో 50 శాతానికిపైగా అనర్హులు, కాంగ్రెస్ నాయకుల పేర్లు ఉండడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం అఖిలపక్ష నాయకులు, అర్హులైన లబ్ధిదారులు సమావేశమయ్యారు. కారోబార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇల్లు లేకుండా కిరాయిలకు ఉంటున్న వారిని వదిలేసి ఇందిరమ్మ కమిటీ కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడాన్ని వ్యతిరేకించారు. ప్రభుత్వం ఒక పక్క ఇల్లులేని పేదలు, దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు ప్రాధాన్యం కల్పించాలని చెబుతుంటే ఐనవోలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యహరిస్తున్నట్లు ఆరోపించారు. ఇందిరమ్మ లబ్ధిదారుల గుర్తింపు కోసం స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రీసర్వే చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తాటికాయల కుమార్, నాయకులు కాటబోయిన అశోక్, గడ్డం రఘువంశీ, తీగల లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ యూత్ నాయకులు దిలీప్, ప్రశాంత్, ఏలియా, కుమార్, అనిల్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పొన్నాల రాజు, నాయకులు బొల్లెపల్లి మహేశ్‌గౌడ్, కోటేశ్వర్, పులి సాగర్, బీఎస్పీ నాయకులు సామ్యూల్, సందీప్, డీఎస్‌పీ విష్ణువర్ధన్, గ్రామస్తులు చింత అశోక్, కొత్తూరి రాజు పాల్గొన్నారు.

వర్షాకాలం నాటికి పూడికతీత పనులు పూర్తి చేయాలి

- **మేయర్ గుండు సుధారాణి**

వరంగల్, మే 9 : గ్రేటర్ పరిధిలోని నాలా పూడికతీత పనుల్లో వేగం పెంచి వర్షాకాలం ప్రారంభం నాటికి పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని బొందివాగు, మ్యూజికల్ గార్డెన్, భద్రకాళీ నాలాల్లో కొనసాగుతున్న పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగర ముంపు నివారణలో భాగంగా నాలాల పూడికతీత పనులను ముందస్తుగా చేపట్టాలన్నారు. రూ.కోటితో చేపడుతున్న కచ్చా కాల్వలు, నాలాల పూడికతీత పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. బొందివాగు, నయీంనగర్, అలంకార్ బ్రిడ్జి, జూపార్క్ నాలా, తిరుమల బార్ జంక్షన్, రైల్వేగేట్, శివనగర్, శాకరాశికుంట నాలాలతో పాటు నగరంలోని అన్ని నాలాల పూడికతీతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాస్, ఏఈలు ముజామిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాలాల పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్

జల్ హీ అమృత్ లక్ష్యాలను అమలు చేయాలి..

కేంద్ర ప్రభుత్వ పథకం జల్ హీ అమృత్ 2.0లో లక్ష్యాలను అమలు చేయాలని మేయర్ ఆదేశించారు. కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్, స్మార్ట్‌సిటీ అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జల్ హీ అమృత్ పథకంలో ఎంపికైన నగరాలకు వచ్చిన రేటింగ్‌లో భాగంగా గ్రేటర్ కార్పొరేషన్‌కు రూ. 3 కోట్లు కేటాయించారని, అందులో రూ. 2.10 కోట్లు మంజూరు చేశారన్నారు. నిధుల వినియోగం కోసం ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. 5, 15 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్ఎఫ్‌టీపీలలో మానిటరింగ్ సిస్టమ్‌తో పాటు ఎస్‌టీపీ భవనాలపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజు 70 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే యూనిట్ ఏర్పాటు చేస్తే 15 ఎంఎల్‌డీ ప్లాంట్ నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. మురుగు నీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు రీయూజ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ పీఎంసీ ఆనంద్ వోలేటి పాల్గొన్నారు.

రక్తదాతలకు సీపీ అభినందన

సుబేదారి, మే 9 : వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కన్నె రాజు, కేయూసీ కానిస్టేబుల్ రవీందర్‌ను సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు. వరల్డ్ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా సుబేదారి రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన శిబిరాల్లో కన్నె రాజు 37సార్లు, రవీందర్ 18సార్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హనుమకొండలోని పోలీసు కమిషనరేట్‌లో సీపీ ఇద్దరు కానిస్టేబుళ్లకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

37సార్లు రక్తదానం చేసిన కానిస్టేబుల్ రాజుకు సర్టిఫికెట్ అందజేస్తున్న సీపీ

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నడికూడ, మే 9 : పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో, ఫైనాన్స్ డైరెక్టర్ దివ్య, ప్రణాళికా సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఫైనాన్స్ ప్రిన్సిపాల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 20 నెలల నుంచి పెండింగ్ బిల్లులు రాక గ్రామ అభివృద్ధికి తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తమ కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయని, వెంటనే బిల్లులు విడుదల చేయాలని కోరారు.

అధికారులను సస్పెండ్ చేయాలి

హనుమకొండ చౌరస్తా, మే 9 : హనుమకొండ నగరంలో ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న డీఈవో, డీఐఈవోని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్‌హౌస్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ప్రైవేట్ స్కూల్స్, జూనియర్ కళాశాలలు నగరంలో పెద్దపెద్ద హోల్డింగ్స్ ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తూ విచ్చలవిడిగా సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఆ విద్యాసంస్థలను వెంటనే మూసివేసి వారిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మల్లేశ్, పవన్, అజయ్, భరత్, సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల పరిశీలనలో వేగం పెంచాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మే 9 : ప్రభుత్వ పథకాల అమలులో చేస్తున్న క్షేత్రస్థాయి పరిశీలనల్లో వేగం పెంచాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాల అర్హుల ఎంపిక పురోగతిపై అధికారుల తో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేసి కలెక్టర్ల లాగిన్లకు పంపించాలన్నారు. రేషన్ కార్డుల కోసం కొత్తగా దరఖాస్తులపై సర్వే మొదలు పెట్టాలన్నారు. రాజీవ్ యువ వికాసానికి వచ్చిన దరఖాస్తులను స్క్రీనింగ్ చేసి, సిబిల్ స్కోర్ కోసం బ్యాంక్‌లకు పంపించాలన్నారు. డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఇతర ప్రాంతాల ధాన్యాన్ని అడ్డుకున్న అధికారులు

కమలాపూర్, మే 9 : మండలంలోని కానిపర్తి శ్రీశైలం మల్లన్న, మర్రిపల్లిగూడెంలోని వీరభద్ర రైస్‌మిల్లుకు ఖమ్మం, ములుగు జిల్లాల నుంచి లారీల్లో వచ్చిన ధాన్యాన్ని అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. ధాన్యం లారీల్లో పెద్ద ఎత్తున రావడంతో స్థానికంగా ఉన్న ధాన్యం కొనుగోలుకు తీవ్ర ఇబ్బంది కలిగింది. స్థానికంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉన్నప్పటికీ ఇక్కడి రైస్ మిల్లులకు ఇతర ప్రాంతాలకు చెందిన సుమారు వందకుపైగా లారీల్లో ధాన్యం వచ్చింది. దీంతో రోజుల తరబడి లారీలు నిలిచి